క్లుప్తంగా

వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మీ దేవి విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీ దేవి

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఆదివారం కొల్హాపురి మహాలక్ష్మీదేవి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఆనంద్‌కుమార్, రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దాతలు, పిల్లిగుండ్ల గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. వేపపండితులు ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, నవగ్రహారాధన, కళసస్థాపన, అంకురార్పణ, దేవనాందీ, బలిహరణ, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు నాయకులు శివరామప్ప, రాజన్న, రామక్రిష్ణప్ప, హనుమంతరెడ్డి, ఈరన్న, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

హిందూపురం అర్బన్: హిందూపురం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ అనుచరులకు ప్రమాదం తప్పింది. ఆదివారం ఒక కారులో శాంతమ్మ, మరో రెండు కార్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు లేపాక్షి వైపు నుంచి హిందూపురం వైపు బయలుదేరారు. హిందూపురం వైపు నుంచి వస్తున్న కారు పూలకుంట సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్ట


జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గుడిబండ: మండల పరిధిలోని గుడ్డదహళ్లి గ్రామంలో ఆదివారం వాల్మీకి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. మహిళలు బియ్యం పిండితో చేసిన జ్యోతులను మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాత ప్రత్యేక పూజలు చేసి జ్యోతులను సమర్పించారు. ఈ పూజా వేడుకలకు గ్రామస్తులతో పాటు హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంతమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, బోయ కులస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

నేడు 'వైఎసార్ ఆసరా' సభ

పెనుకొండ: పట్టణంలోని మార్కెట్‌యార్డ్ ఆవరణలో సోమవారం ఉదయం 10:30 గంటలకు నాల్గో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైకేపీ ఏపీఎం నాగేంద్ర ఆదివారం తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ధనాపురం విద్యార్థిని


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందిస్తున్న దృశ్యం

పరిగి: ధనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిఖిల రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ సుకన్య తెలిపారు. రెండు రోజుల క్రితం సత్యసాయి జిల్లా కొత్తచెరువులో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక పోటీల్లో నిఖిల ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. త్వరలో చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

జటాయువు మోక్షఘాట్‌కు మోక్షం


జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న చైర్మన్ తదితరులు

లేపాక్షి: మండలంలోని జటాయువు పక్షి మోక్ష ఘాట్‌కు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆదివారం సాయంత్రం మోక్షం కలిగించారు. 10 సంవత్సరాల క్రితం జటాయువు మోక్ష ఘాట్‌లో నిర్మిస్తున్న పనులు అర్ధంతరంగా ఆగిపోయిన విషయం విదితమే. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత జటాయువు మోక్ష ఘాట్ పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఆయన సొంత నిధులతో జటాయువు దగ్గర పనులను పునరుద్ధరించారు. రెండు రోజుల్లో జటాయువుకు సంబంధించిన 81 సెంట్లలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను జేసీబీతో తొలగిస్తామన్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌తో చర్చించి జటాయువు మోక్షఘాట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా

• మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్నారని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వైఎస్సార్ ఆసరా 4వ విడతకు సంబంధించిన 756 సంఘాలకు గాను రూ.5,83,25,036 మెగా చెక్కును అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళల రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని ఇచ్చిన హామీని జగనన్న నెరవేర్చారన్నారు. అక్కచెల్లెమ్మలకు అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి పొదుపు మహిళలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసం చేశారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరును జీర్ణించుకోలేక పచ్చ మీడియా బురద జల్లుతోందన్నారు. ప్రతి పక్షాలైన టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల సమయం అబద్ధపు హామీలతో వస్తున్నారని, ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ.నర్సయ్య, ఈఓఆర్డీ నాయరాజు రావు, ఏపీఎం రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, ఎంపీపీ గంగమ్మ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణంరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నారాయణ రెడ్డి, సర్పంచ్‌లు గంగాదేవి, అంజి నాయక్, రామాంజి, జీలాన్ ఖాన్, లలితమ్మ, నిర్మలమ్మ, ఎంపీటీసీలు ఈశ్వరయ్య, నాగప్ప, సింగిల్ విండో చైర్మన్‌లు కొల్లప్ప, ఆదినారాయణ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


'వైఎస్సార్ ఆసరా' మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్


హాజరైన మహిళలు

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు వర్తించాలి


మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

గోరంట్ల: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, వలంటీర్లు, స్టోర్ డీలర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ తీసుకొని ప్రతి ఇంటికీ వర్తింపజేయాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని చందు ఫంక్షన్ హాలులో మండలస్థాయి వలంటీర్లు, స్టోర్ డీలర్లు, యానిమేటర్లు, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై మంత్రి సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాజకీయ లబ్ధి కోసం ఆచరణ సాధ్యం కాని 600లకు పైగా హామీలు ఇచ్చి, వాటిని విస్మరించారన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, మరోమారు ప్రజలను మోసం చేయడానికి టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలముందుకు వస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలు స్టార్ క్యాంపెయినర్లుగా మారి, పార్టీ విజయకేతనం ఎగురవేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్ , పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫకృద్దీన్ సాహెబ్, పార్టీ మాజి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు నార్సింపల్లి శివారెడ్డి, పద్మనాభ రెడ్డి, రఘురామిరెడ్డి, రాజేంద్రప్రసాద్, ప్రభాకర రావు, మేదర శంకర, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, పులేరు, వెంకట రమణపల్లి సర్పంచులు ప్రభాకారరావు, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

అగళి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. ఆదివారం మండలంలోని ఇరిగేపల్లిలో సమన్వయకర్త పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ఇరిగేపల్లి గ్రామంలో శశిధర్ కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, సర్పంచ్ ముద్దరాజు, నాయకులు, కామరాజు, హేమంత్ రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

గుడిబండ: మండల పరిధిలోని కేడి పాళ్యంలో బలరాం యువసేన ఆధ్వర్యంలో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్పకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఒడిసెలమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో సమన్వమకర్త మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రదాన కార్యదర్శి జీబీ శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఇరిగేపల్లిలో నాయకులతో సమావేశమైన సమన్వయకర్త ఈరలక్కప్ప

సిద్ధం సభకు తరలిరండి

మడకశిర: రాప్తాడు సమీపంలో ఈనెల 18న జరగనున్న సిద్ధం సభకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. మాజీమంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, శివకుమార్, రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, వాగేష్, రొళ్ళ జెడ్పీటీసీ అనంతరాజు తదితర పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు వచ్చే పార్టీ శ్రేణులకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలను కోరారు.

రేణుకారాజ్‌కు కర్ణాటక సేవారత్న అవార్డు



పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విజ్ఞానశాస్త్రం ఉపాధ్యాయుడు రేణుకారాజ్ కర్ణాటక సేవా రత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం బెంగళూరులోని అక్కమహాదేవి సభా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జన్మభూమి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా జన్మభూమి రవి చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. డా బాల గంగాధరనాథ మహాస్వామి జయంత్యుత్సవం, జన్మభూమి సేవాట్రస్ట్ 5వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు.

రొళ్ల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రసాద్



రొళ్ల: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఆర్ వీవీజీఎం ప్రసాద్ ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఎంపీడీఓ కె.ఆజాద్‌ను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ ఎంపీడీఓ విధుల్లోకి చేరే వరకూ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఆర్‌వీవీజీఎం ప్రసాద్ బాధ్యతలు నిర్వహించనున్నారు.

వైభవంగా చోళమాంబ దేవి ఉత్సవాలు


మద్దనకుంట నుంచి కానుకలు తెస్తున్న భక్తులు


అలంకరణలో చోళమాంబదేవి

అమరాపురం: మండల కేంద్రంలోని కోట వీధిలో వెలసిన చోళమాంబ దేవి ఉత్సవాలు అంగరంగా వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం బ్రహ్మీణీ ముహూర్తంలో ఆలయ గాలి గోపురంపై నూతనంగా తయారు చేసిన కలశాలను అర్చకులు వేద మంత్రోచ్చరణాల మధ్య ప్రతిష్ఠించారు. భక్తుల కోలాహలం మధ్య చోళమాంబ దేవిని ఆలయ ప్రవేశం చేయించారు. అనంతరం మద్దనకుంట, బంగారుపాళ్యం, పుల్లీకుంట, వీరాపురం, అమరాపురం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి కానుకలు అందజేశారు. అర్చకుడు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్, యాజమానులు, గౌడలు, శానుబోగ, గొంచికార్లు పాల్గొన్నారు.

నేడు జలధి ఉత్సవం

సోమవారం తెల్లవారు జామున అమ్మవారికి బంగారు పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలోని వంక వద్ద జలధి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ అక్కడే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.


అమ్మవారికి ప్రసాదం తీసుకొస్తున్న గొంచికార్లు

కన్యకా పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం

రొళ్ల: మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డు పక్కన ఉన్న కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం సాయంత్రం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత పట్టణంలో నివాసం ఉంటున్న ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకున్నారు. తర్వాత అమ్మవారి విగ్రహం ఎదుట 108 రకాల పిండిపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి ఎదుట జ్యోతులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆర్యవైశ్యం సంఘం తరపున అన్నదానం చేశారు.

మడకశిర: పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ బజార్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


రొళ్లలో 108 రకాల పిండిపదార్థాలతో పూజలు చేస్తున్న మహిళలు

'ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి'


ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

హిందూపురం టౌన్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారతరత్న పురస్కారాన్ని అందించాలని అభిమానులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇందిరా పార్క్‌లో ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఘంటసాల విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు.

బహుజనులు చైతన్యవంతులు కావాలి


మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి కిష్టప్ప

పెనుకొండ: బహుజనులు చైతన్యవంతులు కావాలని, అన్ని రంగాల్లో రాణించాలని విశ్రాంత జడ్జి కిష్టప్ప, బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, న్యాయవాది శివరామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేడు సమాజంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అనేక రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. వారు చైతన్యం కాకపోతే ఆ కుటుంబాలతో పాటు వారి పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. బహుజనులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరంగా ముందంజ వేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, వెంకటేసులు, సూరి, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, హరిలాల్‌నాయక్, వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు ఆదిఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలన్నారు.

దీన్ దయాళ్‌కు నివాళి

హిందూపురం టౌన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ బలిదాన్ దివాస్ సందర్భంగా చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పార్థసారథి, ఆదర్శ్ కుమార్, వరప్రసాద్, శంకర్, బదిరి, కృష్ణప్ప, శ్రీనివాసులు, సునీల్, కొదండపాణి, గోవిందరాజులు, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హిందూపురం: మస్జీద్ ఏ సలఫియా ఆధ్వర్యంలో ఆదివారం ఆజాద్‌నగర్‌లోని మసీదులో ముతవల్లీ జావీద్ ఆలం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగావైద్యశిబిరం నిర్వహించారు. ఆల్ ఇండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారుక్ ఖాన్, బెంగళూరు సప్తగిరి హాస్పిటల్ వైద్యులు జునేద్, సంగమేష్, మనోజ్, ఈశ్వర్, మౌలానాలు అబ్దుల్ రహమాన్, ఉస్మాన్ ఘనీ, అజమత్. హఫీజ్ ఉజయర్,ఫయాజ్, అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

టీ కొట్టు దగ్ధం

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లిలో బాబా ఖాన్‌కు చెందిన టీ కొట్టుకు దుండుగులు ఆదివారం తెల్లవారుజామున నిప్పుపెట్టారు. స్థానికులు గమనించి, మంటలు ఆర్పివేశారు. కొట్టులోని ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యింది. రూ.50 వేల వరకు నష్టపోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలన్నాడు.

సామాజిక సేవలు అభినందనీయం

హిందూపురం: సామాజిక సేవలు అభినందనీయమని పట్టణ వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎంఈఓలు గంగప్ప, శేషాచలం అన్నారు. ఆత్మీయ ట్రస్ట్, హిందూపురం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం మార్క్ సూపర్ స్పెషాలిటీ హార్ట్ కేర్ హస్పిటల్ సౌజన్యంతో ఆల్‌హిలాల్ స్కూల్ మైదానంలో ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ముఖ్యఅతిథిలతోపాటు ఆత్మీయ ట్రస్ట్‌ప్రతినిధులు రంజిత్, నారాయణస్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా రోగులకు 2డీ, ఎకో, ఈసీజీ, బ్లడ్, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్క్ హాస్పిటల్ డాక్టర్ నాగరాజ, మేనేజర్ వినోద్, యూటీఎఫ్ నాయకులు మారుతి, బాబు, మహంతి, చెన్న , రాము, అనిల్, రంగనాథ్, సుల్తాన్, హనుమంతప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి ప్రాథమికోన్న పాఠశాలలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ నరేష్‌కుమార్ తెలిపారు. కదిరేపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పరీక్షలు, చికిత్సలు చేసి, ఉచితంగా మందులను అందజేస్తారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పరిగికి మంత్రి ఉషశ్రీ చరణ్ రాక

పరిగి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును పంపిణీ చేయడానికి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీఎం దేవానంద్ ఫిలిప్పన్ తెలిపారు. స్థానిక బీరప్ప ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

నేడు చౌడేశ్వరీ దేవి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ దేవి

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంగపూజ, అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం జ్యోతుల ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

యాత్ర-2కు ప్రేక్షకుల బ్రహ్మరథం


సినిమా చూసేందుకు వచ్చిన అభిమానులు

పావగడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర నేపథ్యంలో చిత్రీకరించిన యాత్ర-2 తెలుగు సినిమాను వీక్షించేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం పట్టణంలోని అలంకార్ థియేటర్‌కు ఆంధ్ర, కర్ణాటక ప్రేక్షకులు వచ్చారు. అగ్ర హీరోలు తీస్తున్న సినిమాలకు ఏ మాత్రం తీసి పోని విధంగా యాక్షన్ మూవీ యాత్ర-2 చిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

మడకశిర: నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఆదివారం ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి.విద్యార్థులను రెండు బ్యాచ్‌లుగా విభజించి పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఒక బ్యాచ్‌కు పరీక్ష నిర్వహించారు. మరొక బ్యాచ్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మడకశిరలో 3 కేంద్రాలు, అమరాపురం, గుడిబండ, రొళ్లలో ఒక్కో కేంద్రంలో ప్రాక్టికల్స్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్స్ తెలిపారు. ఈనెల 15 వరకూ ప్రాక్టికల్స్ జరుగుతాయని పేర్కొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రం సమీపంలోని బైరేకుంటలోఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులకు బోటనీ సబ్జెక్టుకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బోటనీ ప్రాక్టికల్స్‌కు 31 మంది హాజరు కావాల్సి ఉండగా 26 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఒకేషనల్‌లో 127 మంది మంది విద్యార్థులుండగా 119 హాజరయ్యారన్నారు.

ఎస్‌ఐ సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



పరిగి: పరిగి నూతన ఎస్‌ఐగా సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2015 బ్యాచ్‌కు చెందిన సత్యనారాయణ గతంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కూడేరు మండలంలో ఎస్‌ఐగా పని చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా ఎస్‌ఐ సత్యనారాయణను ఇక్కడ నియమించారు.

అమరాపురం ఎస్‌ఐగా జనార్దన నాయుడు



అమరాపురం: అమరాపురం ఎస్‌ఐగా జనార్దన నాయుడు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బదలీపై వెళ్లారు. రామగిరి ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న జనార్ధన నాయుడును ఇక్కడికి బదిలీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.